**273వ అధ్యాయం**

# ٢٧٣ ـ بابُ تَحرِيمِ احتِقَارِ المُسلِمِينَ

# ముస్లింలను చులకనగా చూడటం నిషిద్ధం

قَالَ اللهُ تَعَالى: ﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا يَسْخَرْ قَوْمٌ مِّن قَوْمٍ عَسَىٰ أَن يَكُونُوا خَيْرًا مِّنْهُمْ وَلَا نِسَاءٌ مِّن نِّسَاءٍ عَسَىٰ أَن يَكُنَّ خَيْرًا مِّنْهُنَّ وَلَا تَلْمِزُوا أَنفُسَكُمْ وَلَا تَنَابَزُوا بِالْأَلْقَابِ بِئْسَ الِاسْمُ الْفُسُوقُ بَعْدَ الْإِيمَانِ وَمَن لَّمْ يَتُبْ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ﴾ [الحجرات: ١١]. وقالَ تَعالى: ﴿وَيْلٌ لِّكُلِّ هُمَزَةٍ لُّمَزَةٍ﴾ [الهمزة: ١].

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాండ్రయి ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి. ఒకరినొకరు చెడ్డ పేర్లతో పిలుచుకోకండి. విశ్వసించిన తర్వాత చెడ్డతనంలో పేరు సంపాదించటం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోనివారే దుర్మార్గులు." *(హుజురాత్: 11)*

"ప్రజలను దెప్పిపొడవటంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచటంలో ఆసక్తి కనబరిచేవాడు సర్వనాశనమయి పోతాడు." *(అల్ హుమజహ్:1)*

١٥٧٦ ـ وعَنْ أَبي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «بِحَسْبِ امْرِئٍ مِنَ الشَّرِّ أَنْ يَحقِرَ أَخَاهُ المُسْلِمَ». رواه مسلم، وقد سبق قريباً بطوله.

1576. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: తోటి ముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడు అని చెప్పటానికి. (ముస్లిం- ఈ హదీసు సవివరంగా ఇంతకు కొద్దిముందే గడిచింది.)

١٥٧٧ ـ وعَنِ ابنِ مسعُودٍ رَضِيَ اللهُ عَنهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَا يَدْخُلُ الجَنَّةَ

1577. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) కథనం ప్రకారం

مَنْ كَانَ فِي قَلْبِهِ مِثْقَالُ ذَرَّةٍ مِنْ كِبْرٍ» فَقَالَ رَجُلٌ: إِنَّ الرَّجُلَ يُحِبُّ أَنْ يَكُونَ ثَوْبُهُ حَسَناً، وَنَعْلُهُ حَسَنَةً، فقال: «إِنَّ اللهَ جَمِيلٌ يُحِبُّ الجَمَالَ، الكِبْرُ بَطَرُ الحَقِّ، وَغَمْطُ النَّاسِ» رواه مسلم. وَمَعْنَى «بطر الحَقِّ»: دَفْعُه، وَ«غَمْطُهم»: احْتِقَارُهُمْ، وَقَدْ سَبَقَ بَيَانُهُ بِأَوْضَحَ مِنْ هٰذَا فِي بابِ الكِبْرِ.

దైవప్రవక్త (సల్లం) (తన సహచరులకు హితోపదేశం చేస్తూ) "మనిషి మనసులో లేశమాత్రం గర్వమున్నా అతను స్వర్గంలోకి ప్రవేశించలేడు" అని అన్నారు. అది విని ఒక వ్యక్తి (సందేహపడుతూ) "మనిషి తన బట్టలూ, చెప్పులు నీటుగా ఉండాలని కోరుకుంటాడు (మరి ఇది కూడా గర్వ మేనా దైవప్రవక్తా!)" అని అడిగాడు. అందుకాయన బదులిస్తూ, "దేవుడు సుందర స్వరూపుడు. సౌందర్యాన్ని ఇష్టపడతాడు. (గర్వం అంటే అది కాదు). వాస్తవానికి గర్వమంటే సత్యాన్ని త్రోసిపుచ్చటం, ప్రజల్ని నీచులుగా భావించటం" అని చెప్పారు. (ముస్లిం)

బత్‌రుల్ హఖ్ అంటే సత్యాన్ని తృణీక రించటం, "గమ్‌తుహుమ్" అంటే ప్రజల్ని చులకనగా చూడటం అని అర్థం. ఈ హదీసు గురించి ఇంతకు ముందు 'గర్వం' అనే అధ్యాయంలో మరింత వివరంగా చర్చించటం జరిగింది.

*(సహీహ్ ముస్లింలోని ఈమాన్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఈ హదీసు ఇంతకుముందు 'గర్వాహంకారాలను ప్రదర్శించటం నిషిద్ధం' అనే అధ్యాయంలో కూడా వచ్చింది. (మొదటి భాగంలోని 612వ హదీసు చూడండి) గ్రంథకర్త ఇమామ్ నవవీ (రహ్మలై) 'బత్‌రుల్ హఖ్' అనేమాటకు 'దఫ్‌వుల్ హఖ్' అని తర్జుమా చేశారు. దాని అర్థం సత్యాన్ని దాటవేయటం, మాటకు ఎదురుచెప్పటం. దీనికి కూడా సత్యానికి దూరంగా ఉండటం, దాన్ని తృణీకరించటం అనే భావమే వస్తుంది. మొత్తానికి చెప్పొచ్చేదేమిటంటే కేవలం

మంచి దుస్తులు ధరించినంత మాత్రాన అది గర్వం అయిపోదు. చాలామంది దాన్నే గర్వంగా భావిస్తున్నారు. నిజానికి గర్వమంటే ఏమిటో పై హదీసులో సూచించటం జరిగింది.

١٥٧٨ ـ وعن جُنْدُبِ بْنِ عَبْدِ اللهِ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «قَالَ رَجُلٌ: وَاللهِ! لَا يَغْفِرُ اللهُ لِفُلَانٍ، فَقَالَ اللهُ عَزَّ وَجَلَّ: مَنْ ذَا الَّذِي يَتَأَلَّى عَلَيَّ أَنْ لَا أَغْفِرَ لِفُلَانٍ! إِنِّي قَدْ غَفَرْتُ لَهُ، وَأَحْبَطْتُ عَمَلَكَ» رواه مسلم.

1578. హజ్రత్ జుందుబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ఒకవ్యక్తి "అల్లాహ్ సాక్షి! అల్లాహ్ ఫలానా వ్యక్తిని క్షమించడు" అని అంటే, దానికి దేవుడు "నేను ఫలానా వ్యక్తిని క్షమించనని ప్రమాణం చేయటానికి నువ్వెవరివి? నేను అతన్ని క్షమించి నీ కర్మల్ని నాశనం చేస్తాను జాగ్రత్త!" అని అంటాడు.

*(సహీహ్ ముస్లింలోని బిర్ర్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

కొంతమంది తమ ఆరాధనను, ధర్మపరాయణతను తలచుకొని మిడిసిపాటుకు లోనై ఇతరుల విషయంలో దురనుమానాలకు లోనవుతుంటారు. ఫలానా వారిని దేవుడు ఎన్నటికీ క్షమించడని ఎంతో నమ్మకంగా చెబుతారు. ఈ ధోరణి దేవుని ఔన్నత్యం పట్ల అగౌరవాన్ని, మితిమీరిన స్వీయ సదభిప్రాయాన్ని సూచిస్తుంది. దీనిని దేవుడు ఇష్టపడడు. ఆయన తలచుకుంటే ఆ ఆరాధకుని, దైవభీతిపరుని కర్మలన్నింటినీ వ్యర్థం చేసేసి అతన్ని నరకంలో పడేయగలడు. అతనికి భిన్నంగా అతను ఎవరిగురించి అయితే దేవుడు క్షమించడని ఒట్టేశాడో అతన్ని మన్నించి స్వర్గానికి పంపగలడు. కనుక మనిషి తన ఆరాధనను చూసుకొని మిడిసిపాటుకులోనై ఇతరుల్ని అల్పులుగా భావించరాదు.